# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 351 | పేజీలు: 4 | వెల: రూ.4/- | బుధవారం 6 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

జమ్మూకశ్మీర్ (మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందినట్లు- సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు జరిపి, సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అస్వస్థతకు గురైన సత్యపాల్ మాలిక్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబర్ 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ పనిచేశారు.

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

- కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన హరీష్ రావు
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం



**హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు.
తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ,

..మిగతా 2లో

## రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన
# స్థానికేతరుడా?

- తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం




**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసంది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్ల బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు

..మిగతా 2లో



# ఉత్తర కాశీలో జలప్రళయం

## కొట్టుకుపోయిన గ్రామం

- ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో కుండపోత వర్షం
- ఆకస్మిక వరదలకు పూర్తిగా కొట్టుకుపోయిన ఓ గ్రామం
- పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం
- ధారాలీ మార్కెట్ ప్రాంతంలో భారీ ఆస్తి నష్టం
- సైన్యం, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు
- ముందుగానే అత్యంత భారీ వర్షాల హెచ్చరిక జారీ చేసిన ఐఎండీ

2

## రాష్ట్రంలో ఆరు లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో మండలి చీఫ్ విఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కలెక్టర్ సి నారాయణ రెడ్డి

**బుద్వేల్, ఆగస్టు 5(నమస్తే ఉదయం):**

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం ఆలోచించే ప్రభుత్వం అని, అందుకే ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తు ముందుకు సాగుతున్నామని తెలం గాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి అయిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తాలో గల మెట్రో కన్వెన్షన్ లో రాజేం ద్రనగర్ నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులకు మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేం దర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి లతో కలసి కొత్త రేషన్ కార్డులు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను తీసుకుని ఆరు లక్షల మంది లబ్దిదారులకు

..మిగతా 2లో

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభలో ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని

..మిగతా 2లో



## బీఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం
# పెద్ద ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

**ఖమ్మం, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం

..మిగతా 2లో

# గద్వాల నియోజకవర్గంలో ఘనంగా
# ఇందిరా మహిళ శక్తి సంబరాలు





గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 ( నమస్తే ఉదయం) మహిళా సంఘాలను బలోపేతం చేసి ఆర్థికంగా, ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తున్నట్లు గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలోని అనంత ఫంక్షన్ హాల్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఇందిరా మహిళా శక్తి ద్వారా కోటి మంది మహిళలకు కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతుందన్నారు. ఇందులో భాగంగా గద్వాల నియోజకవర్గం అభివృద్ధి కోసం 3500 ఇందిరమ్మ గృహాలను మహిళల పేరున మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించి, రేషన్ కార్డుల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసి బస్సులకు యజమానులు చేసి ఉపాధి కల్పిస్తున్నామని, అంతేగాక పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, క్యాంటీన్లు ఏర్పాటు చేసి ఆదాయం కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి దశలవారీగా సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందని ఎవరు కూడా నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా మహిళా సంఘాలకు ప్రత్యేక పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం సోలార్ విద్యుత్ ప్లాంట్ లు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, బస్సులకు యజమానులుగా చేస్తూ నెలకు లక్ష రూపాయల ఆదాయం సమకూర్చే విధంగా వివిధ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. పెట్రోల్ బంకు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం గద్వాల మండలానికి 1,587 కొత్త రేషన్ కార్డులు, 4877 మంది పేర్లను రేషన్ కార్డులలో కొత్తగా నమోదు చేసి అందించడం జరుగుతుందన్నారు. అంతేగాక మహిళా సంఘాలకు 50.61 లక్షల వడ్డీ లేని రుణాలను, 53 సంఘాలకు 7.87 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలలో కొత్తగా సభ్యులుగా చేరేందుకు తమ పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వం కల్పిస్తుంది సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సందర్భంగా గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాల చెక్కు, వడ్డీ లేని రుణాల చెక్కు, లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?

మొదటి పేజీ తరువాయి...

దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసు కోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పలు రాష్ట్రాల్లో్ర స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వీ కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

## ఉత్తర కాశీలో జలప్రళయం

న్యూఢిల్లీ, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)

దేవభూమి ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం సంభవించిన కుండపోత వర్షం (క్లౌడ్ బరస్ట్) పెను విషాదాన్ని మిగిల్చింది. హర్సిల్ సమీపంలోని ధారాలీ ప్రాంతంలో ఆకస్మిక వరద పోటెత్తడంతో ఒక గ్రామం పూర్తిగా కొట్టుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందడంతో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.ధారాలీ వద్ద ఉన్న ఖీర్ గధ్ వాగులో నీటిమట్టం ఒక్కసారిగా ప్రమాదకర స్థాయిలో పెరగడంతో వరద నీరు సమీపంలోని మార్కెట్ ప్రాంతాన్ని ముంచెత్తింది. దీనివల్ల తీవ్ర ఆస్తి నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీస్, అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), భారత సైన్యం రంగంలోకి దిగాయి. విపత్తు సహాయక బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి.ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ధారాలీ ప్రాంతంలో కుండపోత వర్షం వల్ల జరిగిన నష్టం గురించి తెలిసి చాలా బాధపడ్డాను. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి" అని ఆయన 'ఎక్స్' వేదికగా తెలిపారు. సీనియర్ అధికారులతో తాను నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నానని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని చెప్పారు. "అందరూ క్షేమంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.

అధికారులు నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నదులు, వాగుల వద్దకు వెళ్లవద్దని, పిల్లలు, పశువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్యపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

కాగా, ఆగస్టు 4 నుంచి ఉత్తరకాశీ, పౌరీ గఢ్వాల్, టెహ్రీ, చమోలీ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఒకరోజు ముందే హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో డెహ్రాడూన్ జిల్లా యంత్రాంగం పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించింది. ముఖ్యమంత్రి ధామి కూడా అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించి సంసిద్ధతను సమీక్షించారు. అయినప్పటికీ ఈ స్థాయిలో నష్టం జరగడం విచారకరం.

## రాష్ట్రంలో ఆరు లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తాం: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి...

కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. దీని ద్వారా 24 లక్షల మంది కి రేషన్ అందుతుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో సుమారు 10వేల మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు నియోజకవర్గంలో రేషన్ కార్డులలో కొత్తగా 24.967 మంది పేర్లను చేర్చడం జరిగిందని తెలిపారు. 10 సంవత్సరాలుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఇది ఒక పండుగ లాంటిదని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అన్నారు. గత పదేళ్లు అధికారం లో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో మీ సేవా కార్యాలయాలు, మండల రెవెన్యు ఆఫీసులు, రేషన్ కార్డు అధికారుల కార్యాలయాల చుట్టు చెప్పులు అరిగేలా తిరిగినా కూడా రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామన్నారు. ఇంకా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా బీఆర్ఎస్, బీజేపీ అనే బేదం లేకుండ ప్రతి ఒక్కరికి పథకాల ఫలాలు అందేలా చూస్తున్నామన్నారు. రేషన్ కార్డులు ఉండటం సమాజంలో ఓ గుర్తిం పు అని ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రధాన ఆధారం అని అన్నారు. ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణీ వనజాత, చేవెళ్ల ఆర్డీవో వెంకటరెడ్డి, రాజేంద్రనగర్ తహసిల్దార్ బి రాములు, ఎఎస్ఓ పుల్లయ్య, ప్రజా ప్రతినిధులు తలారి మల్లేష్, ఎం సంగీత గౌరీశంకర్, అధికారులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు. ఈ నివేదికలు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనని హరీష్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయట పెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమీషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమీషన్లు. రాష్ట్ర మంతా కమీషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఎస్‌ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు- ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టిందని ప్రశ్నించారు.



## యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

కేటిదొడ్డి, ఆగస్టు5 (నమస్తే ఉదయం)జిల్లాలో యూరియా నిల్వలు రైతులకు అవసరమైనంత మొత్తంలో ఉన్నాయని, యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత లక్ష్మీ హెచ్చరించారు. కేటిదొడ్డి మండలంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంతో, పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఏడిఏ సంగీత లక్ష్మీ తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్ట్రర్‌లు, బిల్ బుక్కులను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. గ్రౌండ్ స్టాక్ , పీఓఎస్ మెషిన్ స్టాక్ మధ్య ఎటువంటి వ్యత్యాసం లేకుండా చుసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే అవసరమైనంత యూరి యాను రైతులు పొలాల్లో వాడేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. బస్తా యూరియా ధర రూ.266లు అని, ఈ మొత్తానికి మించి ఎక్కడైనా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.రాజవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

మొదటి పేజీ తరువాయి...

తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ-, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు- జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

మొదటి పేజీ తరువాయి...



ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు కింద అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి పాలన పొడగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపి వేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు- స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ- మెయిటీ- కమ్యూనిటీ-, మైనారిటీ- కుకి-జోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో అక్కడ శాంతిభద్రతలను కాపాడేందుకు కేంద్రం రాష్ట్రపతి పాలనకు మొగ్గుచూపింది.

## తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని
# గుంట నక్కలా వేల కోట్లు దోచుకున్న కేసీఆర్

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**



కూకట్‌పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం)కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాట్లాడిన టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవకతవకలు జరిగాయని, నాటి ప్రభుత్వ పెద్దలు తీసుకున్న నిర్ణయాల వల్ల పెద్ద మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగమైందని జస్టిస్ ఘోష్ కమిషన్ నిగ్గు తేలిచిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ నిర్మాణం కేవలం కేసీఆర్ నిర్ణయమే. ముఖ్య మంత్రి , ఉప ముఖ్య మంత్రి చాల స్పష్టంగా సుదీర్ఘమైన ప్రెస్ మీట్ లో తెలంగాణ ప్రజలు అందరికి చాల స్పష్టంగా చెప్పారని తెలిపారు. కాళేశ్వరరావు కేవలం అవినీతి ప్రాజెక్ట్ కేసిఆర్ కుటుంబం కేవలం దోచుకుంది, దాచుకుందని మాత్రమే అనుకున్నాం. కానీ నిన్న ఆ సమావేశంలో జస్టిస్ ఘోష్ నివేదిక చూసాక, ఈ కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రజా ధనాన్నిదుర్వినియోగం చేసిన విధానం ప్రజా జవాబుదారిగా ఉండాల్సిన ముఖ్య మంత్రి, ఒక ట్రస్టీ గా ఉండాల్సిన ముఖ్య మంత్రి తన ఒంటెద్దు పోకడలతో నియంతృత్వ విధానాలతో నిర్లక్ష్య ధోరణితో ఎన్ని అవలక్షణాలు ఉన్నాయో అన్ని రాత్రి పూట డైనింగ్ టేబుల్ మీద కూర్చొని వారు తీసుకున్న నిర్ణయాలకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకి తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన గత పాలకుడు కేసిఆర్ అని స్పష్టం అయిందని, ఈ కూలి పోయిన కాళేశ్వర్ రావు ప్రాజెక్ట్ కు పూర్తిగా బాధ్యత తీసుకోవాల్సిందే కేసీఆర్ రేపు అసెంబ్లీ కి వచ్చి బహిరంగంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. రూ. 38,500 కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ప్రారంభించి, అంచనా వ్యయాన్నిఏకంగా రూ. లక్ష10 వేల 248 కోట్లకు పెంచారని, కాళేశ్వరం కార్పొరేషన్ పేరుతో తీసుకున్న రూ. 87,449.15 కోట్ల రుణాలు రాష్టానికి గుదిబండగా మారాయన్నారు. తెలంగాణ కు కాపలా కుక్కలా ఉంటా అని జనాన్ని నమ్మించి గుంట నక్కలా వేలకోట్లు దోచుకోవడం.. అక్రమ సంపాదన కోసం కాళేశ్వరం కట్టడం తో లక్షల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం.. ప్రజలను పాలించమని అధికారం ఇస్తే 10 ఏళ్లు మందేసుకోని ఫాం హౌస్ లో పడుకుని తాను తెలంగాణ ను బంగారు తెలంగాణ చేశానని ప్రచారం చేసుకోవడం తప్ప చేసింది ఏమి లేదన్నారు. మీది అసమర్థ పాలన అనే మిమ్మల్ని ప్రజలు ఇంట్లో కూర్చోబెట్టారని మీకు బీజేపీతో లోపాయికారి ఒప్పందం ఉండడం వల్లే పదేండ్లలో మీరు ఎన్ని కుంభకోణాలు చేసినా.. మీవైపు సీబీఐ, ఈడీ కన్నెత్తి చూడలేదని, రాష్ట్రానికి కేంద్రం పైసా ఇవ్వవకపోయినా మీరు మూతులు ముడుసుకొని కూసున్నరని, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి మిగులు రాష్ట్ర ఖజానాకు తెగులు పట్టించిన్రు అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో పేద బడుగు బలహీన వర్గాలన్నింటికీ రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత బీసీ ధర్నాపెద్ద జోక్ పదేండ్లు ఆమెకు బీసీలు ఎందుకు గుర్తుకు రాలేదన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం, బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. అమలు పోరాటంలో అందరూ కలిసి రావాలి బీసీ రిజర్వేషన్ల కోసం రాజకీయాలకతీతంగా పోరాడుదాం ముస్లింలను సాకుగా చూపి బీసీ బిల్లుని బీజేపీ అడ్డుకుంటోంది అన్నారు. కేంద్రం పై ఒత్తిడి పెంచేందుకు, కనువిప్పు కలిగేలా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్నాం అన్నారు.



ఎన్ టీ ఆర్ నగర్ లో పర్యటిస్తున్న మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## ఎన్టీఆర్ నగర్‌లో కార్పొరేటర్ తోకల పర్యటన

బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో మం గళవారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమకు రోడ్డు సరిగ్గా లేదని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతు, ఎన్టీఆర్ నగర్ లో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. ఇప్పటికే మంజూరైన పనులు నాణ్యతగా ఉం డేటట్లు చూడాలన్నారు. భూగర్భ డ్రైనేజీ పైపు లైన్ పనులు సరైన మార్పులు చేర్పులు చేసి చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జలమండలి. జీహెచ్ఎంసీ అధికారులు నర్సింహ్మ మూర్తితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## వనపర్తి జిల్లా నూతన అడిషనల్ కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5(నమస్తే ఉదయం) వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ గా నూతనంగా భాద్యతలు చేపట్టిన కీమ్యా నాయక్ ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు వనపర్తి జిల్లా పరిధిలోని పలు విషయాలను గూర్చి అడిషనల్ కలెక్టర్ తో చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లే ప్రశాంత్, మండల అధ్యక్షుడు నాగరపు బీచుపల్లి,జిల్లా ప్రధాన కార్యదర్శి పాపయ్య గారి కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ చర్లపల్లి శేఖర్ రెడ్డి,మాజీ ఎంపిపి వెంకట్ నారాయణ్,మాజీ సర్పంచ్ మాసన్న,మాజీ సర్పంచ్ శివరామ్, శ్రీధర్ రెడ్డి,హనుమాన్ రావు,తిరుపతి రెడ్డి,సాయిబాబు,రాములు,యాదగిరి రెడ్డి, వహీద్,తదితరులు పాల్గొన్నారు..




**అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు ఏడు సీలింగ్ ఫ్యాన్లు, మూడు బీరువాలు బహుకరించారు. పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రధానోపద్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ సాగర్, సాయి ప్రసాద్ రావు, రజియాబేగం, సుజాత, రంగారెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.**

**- బుద్వేల్, నమస్తే ఉదయం**

# బడి బస్సుల భద్రత ఎంత?

**నిబంధనలు విస్మరిస్తున్న ప్రైవేటు పాఠశాలలు**

**పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న వైనం**

**తరచూ ప్రమాదాలు.. ఆందోళనలో తల్లిదండ్రులు**

గద్వాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (నమస్తే ఉదయం) నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు వివిధ రకాల వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం తమ సొంత బస్సుల్లోనే విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తుంటాయి. అయితే ఈ బస్సులను ఫిట్‌గా ఉంచడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకొని విద్యార్థులు గాయాలబారిన ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా చాలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌పై పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లకు ఆర్టీవో అధికారులు అవగాహన కల్పించారు. బస్సులను తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నా కొందరు పట్టించుకోవడంలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తున్నారు.

**రవాణ చార్జీల పేరిట దోపిడి**

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రవాణా చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నా.. భద్రతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో ఉన్న పలు ప్రైవేటు విద్యాసంస్థలకు ఎక్కువగా వచ్చేది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే. తల్లి దండ్రులు పిల్లలను స్కూల్‌కు పంపి వారి పని మీద వారు వెళ్తే.. బస్సులో స్థాయికి మించి ఎక్కువ విద్యార్థులను తరలించి గమ్య స్థానాలకు చేరుకుంటారో తెలియని పరిస్థితి. ఒక్కో విద్యార్థి నుంచి ప్రైవేటు విద్యాసంస్థలు నెలకు రూ.1000 నుంచి రూ.6000 వరకు దూరాన్ని బట్టి వసూలు చేస్తున్నాయి. తమ పిల్లలు భద్రంగా ప్రయాణం చేస్తారనే నమ్మకంతో తల్లిదండ్రులు ఉంటారు. గద్వాల పట్టణం, ధరూర్ మండలంలోనే పలు ప్రైవేట్ స్కూల్ బస్సులో పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించి కూర్చోవడానికి కూడా వీలు లేకుండా పోయింది. బస్సులో డెబ్బై మందికి పైగా ప్రయాణాలు చేస్తున్నారు. ఇద్దరు కూర్చొని ప్రయాణించాల్సిన సీట్లలో నలుగురు కూర్చోని ప్రయాణిస్తున్నారు. స్కూల్ బస్సు డ్రైవర్ లు వాహనాలను అతివేగంగా నడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం గద్వాలలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్




అతివేగంగా, నిర్లక్ష్యంగా బస్సును నడపడంతో గోనుపాడు గ్రామస్తులు అడ్డుకుని స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. అదే విధంగా బల్గెరలో ఓ ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇలా తరుచు బస్సు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రైవేటు స్కూల్ బస్సుల ప్రమాదాలు జరగకుండా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**యాజమాన్యాలదే బాధ్యత: డి టి ఓ టి.వెంకటేశ్వర రావు,**

విద్యాసంస్థల బస్సులను నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. నింబంధనలు అతిక్రమించిన బస్సులను సీజ్ చేస్తున్నాం. స్కూల్ బస్సుల విషయంలో యాజమాన్యాలే పూర్తి బాధ్యత తీసుకోవాలి. కండీషన్‌లో ఉన్న బస్సులను ఏర్పాటు చేసుకోవాలి. నిష్ణాతులైన డ్రైవర్లనే ఎంపిక చేయాలి. ఫిట్‌నెస్ పత్రాలు పొంది ఉండాలి. లేదంటే చర్యలు తప్పవు.



అదనపు తరగతి గది ని ఎం ఈ ఓ శంకర్ రాథోడ్ తో కలసి ప్రారంభిస్తున్న సిస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్

## అత్తాపూర్ దళితబస్తీలోని ప్రాథమిక పాఠశాలలో సిస్ సాఫ్ట్వేర్ అధ్వర్యంలో మౌలిక సదుపాయాలు

బుద్వేల్, ఆగస్టు 5 (నమస్తే ఉదయం): అత్తాపూర్ దళిత బస్తీలో గల ప్రాథమిక పాఠశాలలో సీస్ సాఫ్ట్వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు రూ. 8 లక్షల తో అదనపు తరగతి గది నిర్మాణం, బెంచీలు, ల్యాప్ టాప్, గ్రంథాలయ గది ని ఏర్పాటు చేశారు. వాటిని రాజేం ద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ తో కలసి సిస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మెల్కియస్ ఆదివారం ప్రారంబించారు. ఈ సందర్భంగా మెల్కియస్ మాట్లాడుతూ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ లో బాగంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. పేద పిల్లల విద్యాభివృద్ధికి తమ సంస్థ ముందుండి పనిచేస్తుందన్నారు. తరగతి గదుల నిర్మాణంతో పాటు త్రాగునీటి వసతి. మరుగుదొడ్ల నిర్మాణం. ఫర్నిచర్ ను అందజేసినట్లు తెలిపారు. రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి ముందుకు రావడం సంతోషకరమన్నారు.




కన్యగారి లక్ష్మీని సన్మానిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

## కన్యగారి లక్ష్మీకి సన్మానం

బుద్వేల్, ఆగస్టు 5(నమస్తే ఉదయం): సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యురాలుగా నియమితులైన కన్యగారి లక్ష్మీని మంగళవారం మహిళా సమాఖ్య సభ్యులు సన్మానించారు. మం గళవారం రాజేంద్రనగర్ మండలం బుద్వేల్ లో గల సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యులు కె. మునేశ్వరీ, అర్ మౌనిక, కె. జ్యోతి. శాలిని, పద్మ, బుజ్జి లు పాల్గొని లక్ష్మీ కి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కన్యగారి లక్ష్మీ మాట్లాడుతూ, మహిళా సమస్యలపై పోరాడుతామన్నారు.



హనుమంతుని పూజిస్తున్న భక్తులు

## మట్టిలో వెలసిన హనుమంతుడు

బుద్వేల్, ఆగస్టు 5(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవుపల్లి డివిజన్ మధుబన్ కాలనీ ని అనుకుని ఉన్న ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థలంలో మట్టిని చదును చేస్తుండగా హనుమంతుని విగ్రహం బయట పడింది. దీంతో ప్రజలు పెద్ద సం ఖ్యలో అక్కడికి చేరుకుని పూజలు చేశారు. ఈ వార్త మైలార్ దేవుపల్లి డివిజన్ లో చర్చనీయాంశమైంది

## ఈ నెల 8న వ్యవసాయ వర్శిటీ యూజీ కోర్సుల ఎన్ఆర్ఎ కోటాకు కౌన్సిలింగ్



డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్

బుద్వేల్,ఆగస్టు 5(నమస్తే ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ యూజీ కోర్సులకు సంబందించి ఎన్ఆర్ఎ/ ఎస్ఆర్ఎ ప్రాయోజిత కోటలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 8వ తేదీన వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ వాక్ ఇన్ కౌన్సిలింగ్ ఉంటుం దన్నారు. ఉదయం 11 గంటలకు ఈ కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్, ప్రవేశరుసుముతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు వర్శిటీ వెబ్సైట్ చూడాలన్నారు.

## రంగారెడ్డి జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ



రాజేంద్రనగర్,ఆగస్టు05(నమస్తే ఉదయం) తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీవో)రంగారెడ్డి జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్‌గా ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కమిటీని ప్రకటించారు. కోకన్వీనర్‌గా కస్తూరి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా ముత్యాల సత్యనారా యణగౌడ్, ఈశ్వర్,యశ్వంత్, ఆర్.రంగయ్య, ఎ.శ్రీనివాస రావు,ఏ. మహేందర్, బీ.మాధవ్‌గౌడ్,మహమ్మద్ అజ్మత్ అలీ, కే.వాణిని ఎన్నుకున్నారు.ఆరు నెలల్లోపు పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని ముజీబ్ ప్రకటించారు.

# వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

### పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

### వర్షాకాల నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి

### యూరియా అమ్మకం సజావుగా సాగాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, ఆగస్టు 05(నమస్తే ఉదయం): జిల్లా లోని ఘనపూర్ మండలం లోని తెలంగాణ సాంఘిక గిరిజన ఆశ్రమ పాఠశాల/ హాస్టల్ ను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టల్లో సానిటేషన్ నిర్వహణ,అలాగే వంటగదిని పరిశీలించారు వర్షాకాల నేపథ్యంలో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, వర్షపు నీరు ఎక్కడ ఆగకుండా చూడాలన్నారు పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలన్నారు.వంటగదిని పరిశీలిస్తూ... వంటకు ఉపయోగించే ప్రతి వస్తువు నాణ్యతతో ఉండాలని, తాజా కూరగాయలను మాత్రమే వాడాలని..మెనూ ప్రకారం భోజన



స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ దవాఖానలో రోగుల, సహాయకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

చేసుకోవాలన్నారు.కంప్యూటర్ క్లాస్ రూమ్ లో ఉన్న విద్యార్థులు ఏం నేర్చుకుంటున్నారు... ఎలా నేర్చుకుంటున్నారని కలెక్టర్ పరిశీలించారు . అనంతరం ప్రభుత్వ దవాఖాన ని సందర్శించి... ఓపి రిజిస్టర్లు, సిబ్బంది రిజిస్టర్లు పరిశీలించారు సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఓపి కొచ్చే ప్రతి పేషెంట్ కి మలేరియా,డెంగ్యూ, చికెన్ గున్యా పరీక్షలు జరపాలన్నారు. ముందస్తుగా మెరుగైన వైద్యం అందించాలన్నారు.ఇన్ పెషేంట్ వార్డ్ ను సందర్శించి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.. డాక్టర్ లు అందుబాటులో ఉంటున్నారా.. మందులు సమయానికి ఇస్తున్నారా అని పెషేంట్ లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంనీ (పి ఏ సి ఎస్) తనిఖీ చేసి పలు సూచనలు చేసారు. ఒకే రైతు గనుక రిపీటెడ్ గా వచ్చినట్లయితే వారిని గుర్తించి డాక్యుమెంట్స్ పరిశీలించి వెరిఫై చేసిన తరువాతనే వారికి యూరియా ఇవ్వాల్సిందిగా సూచించారు. జిల్లాలో యూరియా సరిపడ ఉందని ఎక్కడ కూడా కొరత అనేది లేదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని, తహసీల్దార్,వైద్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న నూతన అడిషనల్ కలెక్టర్

## వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎన్.కీమ్య నాయక్

వనపర్తి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 ( నమస్తే ఉదయం) వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) గా ఎన్. కీమ్య నాయక్ నియమితులయ్యారు. మంగళవారం వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ హెూదాలో కొత్తగా వచ్చిన ఎన్. కీమ్య నాయక్ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ను పూల మొక్క అందజేసి మర్యాద పూర్వకంగా కలిసారు. కీమ్య నాయక్ అదనపు కలెక్టర్ గా సోమవారం విధులకు రిపోర్టు చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ లేక పోవడంతో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు.



## వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన కొత్తకోట మాజీ ఎంపిటిసి సభ్యురాలు బీసం శకుంతల చెన్నకేశవరెడ్డి

కొత్తకోట, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం మిన్నిపాడు గ్రామానికి చెందిన శ్రీనాథ్ రెడ్డి సువర్ణ దంపతుల కుమారుడు వివాహ రిసెప్షన్ హైదరాబాదులో జరిగింది. ఈ రిసెప్షన్ వేడుకలకు కొత్తకోట పట్టణ మాజీ ఎంపిటిసి సభ్యురాలు బీసం శకుంతల చెన్నకేశవరెడ్డి , బీసం శ్రీలక్ష్మి, బీసం జానకి రామ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన వధూవరుల పరులను ఆశీర్వదించారు.



ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బిజెపి నాయకులు

## కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

కేటిదొడ్డి, ఆగస్టు5 ( నమస్తే ఉదయం)కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మంగళవారం కేటిదొడ్డి మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో కేటిదొడ్డి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు, సిసి రోడ్లు, పానాది రోడ్ల నిర్మాణాలు, చివరికి శ్మశానవాటికల నిర్మాణాలు సైతం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు చేరడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. మన గ్రామం రేపటి మార్పు అనే అంశంపై ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను ప్రజలకు వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపర్చే అభ్యర్థులను గెలిపించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ అనిమి రెడ్డి, నాయకులు భీమిరెడ్డి, సూర్యకాంతరెడ్డి, చింతలకుంట సాయన్న, ఓబిసి రాముడు, మైలగడ్డ రాములు, కేటి దొడ్డి బూత్ అధ్యక్షుడు వీరేశ్, వాచ్యా నాయక్, ఈరన్న, ఎస్సీ మోర్చ ముని, అంజి ,కొండన్న కృష్ణ కాంత్, తదితరులు పాల్గొన్నారు.



## రూ.4.2 కోట్లు విలువ చేసే గంజాయి పట్టివేత

### డ్రగ్స్ పై ఈగల్ టీం ఉక్కుపాదం..

### గంజాయి సరఫరా చేస్తున్న అంతర్ రాష్ట్ర నిందితులు అరెస్ట్

శంషాబాద్,ఆగస్టు05(నమస్తే ఉదయం)మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ టీం డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోంది.ఎక్కడికక్కడ తనిఖీలు, మెరుపు దాడులతో డ్రగ్స్ మహమ్మారిని కట్టడి చేస్తోంది.ఈగల్ టీం.ఈ క్రమంలో మంగళవారం శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి వద్ద గంజాయి స్మగ్లర్లను పట్టుకున్నారు.ఒరిస్సా నుండి హైదరాబాద్ మీదుగా ఉత్తరప్రదేశ్ కు తరలిస్తున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఈగల్ టీమ్ తెలిపింది.26 బ్యాగుల్లో 411 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వీరిద్దరి నుంచి 847 కేజీల గంజాయితో పాటు రెండు సెల్ఫోన్లు,బొలెరో వెహికల్,ఒక తల్వార్ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 4.2 కోట్లు ఉంటుందని తెలిపారు.పట్టుబడ్డ ఇద్దరు నిందితులు కూడా ఒడిశాకు చెందిన వారు కాగా,గంజాయి తరలిస్తున్న బొలెరో వాహనం మాత్రం యూపీలో రిజిస్ట్రేషన్ అయి ఉంది.ఒడిశా నుంచి యూపీకి గంజాయి తరలిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో ఈగల్ టీమ్ అప్రమత్తమైంది.



## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

### వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత లక్ష్మీ

కేటిదొడ్డి, ఆగస్టు5 ( నమస్తే ఉదయం)నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తే రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీత లక్ష్మి అన్నారు. మంగళవారం కేటిదొడ్డి మండల కేంద్రంలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆయిల్ పామ్ పంటలో యాంత్రీకరణ పై జిల్లా ఉద్యానవన అధికారి అక్బర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రభుత్వం ఆయిల్పాం సాగు చేసే రైతులకు మొక్కలు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందజేస్తోందన్నారు. ఆయిల్ఫామ్ సాగుకు తక్కువ పెట్టుబడి అవసరమవుతుందని, ఇతర పంటలతో పోలిస్తే నికర లాభాలు ఎక్కువన్నారు. ఈ కార్యక్రమంలో కేటిదొడ్డి ఏఓ వై.రాజవర్ధన్ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మహేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య,కిరణ్,ప్రీతి,ప్రియాంక,మమత,జ్యోతి అలాగే రైతులు పాల్గొన్నారు.

## ప్రగతి నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

మక్తల్,05, (నమస్తే ఉదయం), మక్తల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రగతి నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. మక్తల్ సమీపంలో 916/2, 917/2 సర్వే నంబర్ లోని పదెకరాల ప్రభుత్వ స్థలంలో రూ. 34 కోట్ల వ్యయంతో చేపట్టిన



150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయని, పనుల్లో వేగం పెంచాలని ఆమె సూచించారు. మైల్డ్ స్టోన్ ప్రకారం నిర్మాణ పనులు త్వరగా జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణ నమూనా ప్లాన్ ను ఆమె పరిశీలించారు. అనంతరం కృష్ణా మండల కేంద్రంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.156 లక్షల నిధులతో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను సైతం కలెక్టర్ పరిశీలించారు. ప్లాస్టరింగ్ దశలో ఉన్న పి హెచ్ సీ భవనం లోపల కొనసాగుతున్న మెడికల్ ఆఫీసర్ గది, స్టాఫ్ రూమ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గదులను చూశారు. నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా మరో మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయని వారు తెలిపారు. పిహెచ్ సీ చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రతిపాదనల్లో ఉందా లేదా? అడిగి తెలుసుకున్నారు. జింకల పార్కు ఏర్పాటు కోసం మూడ్ మల్ శివారులో ప్రభుత్వ స్థలాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారా ?లేదా ? అని రెవెన్యూ అధికారులను అడిగిన కలెక్టర్ వెంటనే అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీ.ఈ. కృష్ణ మూర్తి, ఏ.ఈ. సాయి మురారి, మక్తల్, కృష్ణా తహసిలార్లు సతీష్ కుమార్, శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపిడిఓ, ఎంఈఓ

కేటిదొడ్డి,ఆగస్టు5(నమస్తే ఉదయం)మండల పరిధిలోని నందిన్నె జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంపిడిఓ రమణరావు, విద్యాధికారి వెంకటేశ్వరరావు తో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలావుందీ అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులు తినే భోజనం వండే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు తెలిపారు. భోజనం నాణ్యత విషయంలో ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు.



## వరద ముంపు బాధితులకు ఆహార పదార్థాలు, వస్తువులతో పునరావాసం

### పీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్

కూకట్పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నిన్న కురిసిన భారీ వర్షానికి పలు నాలా పరివాహక ప్రాంతాలు మునిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఫతేనగర్ డివిజన్ అమృత్ నగర్ తండా, దీన్ దయాల్ నగర్, ప్రభాకర్ రెడ్డి నగర్ తదితర ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. మంగళవారం పీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృత్ నగర్ తండా లోతట్టు ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయి స్థానికులు రోడ్డున పడ్డారు. ప్రధానంగా నివాసాల్లో ఆహార పదార్థాలు ఇతర వస్తువులు పనికిరాకుండా పోవడంతో నిన్న రాత్రి వాళ్ళు ఆహారం తినే పరిస్థితి లేకుండా పోయిందని, కట్టుబట్టలతో రోడ్డును పడిన బస్తీ వాసులు కంటిమీద కునుకు లేకుండా అప్పటికి తాత్కాలికంగా హౌసింగ్ బోర్డు 15 పేస్ దగ్గరలో గల ఇందిరమ్మ గృహాల్లో తలదాచుకున్నారు. మంగళవారం ఉదయం వరద ముంపు బాధితులకు మున్సిపల్ అధికారులు కెపిహెచ్బి కాలనీ నాలుగో ఫేస్ ఫంక్షన్ హాల్ లో పునరావాసం ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన బండి రమేష్ మాట్లాడుతూ వరద బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈమేరకు కెపిహెచ్బి కాలనీ నాలుగో ఫేస్ లోని ఫంక్షన్ హాల్ లో బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. బాధితులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, పరిస్థితులు కుదుటపడే వరకు ప్రభుత్వమే అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ కుక్కల రమేష్, స్థానిక నాయకులు బాకీ, శివ చౌదరి తదితరులు పాల్గొన్నారు.




## యువత ఉద్యోగంతో పాటు వ్యాపారం కూడా రాణించాలి

### యువతను ప్రోత్సహిస్తున్న యువ నాయకుడు గాదె శివ చౌదరి

కూకట్పల్లి, ఆగస్టు 5 (నమస్తే ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని మాదాపూర్ లో సోదరుడు మోరంపూడి చెన్నారావు నూతన వ్యాపారం మొబైల్ క్యాంటీన్ టీ పాయింట్ ను కాంగ్రెస్ పార్టీ యువనేత గాదె శివ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనిషి మనుగడకు నమ్మకం అనేది ముఖ్యమని, నమ్మకం, విలువలతో కూడిన ఏ ఆలోచన, ఏ వ్యాపారమైన ముందడుగు వేస్తుందని తెలిపారు. ఈ రోజుల్లో పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకుని మనిషి మనుగడకు ఉద్యోగం ఒకటే సరిపోదని, వ్యాపారం కూడా తప్పనిసరి, మనిషి 24 గంటల్లో ఎక్కువ భాగం కష్టపడటానికి ఇష్టపడాలని, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఎంఎంఎస్ ఈ ముద్ర లోన్స్, అలాగే కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అందించబోతున్న రాజీవ్ యువ వికాసం వంటి వంటి పథకాలు యువతను స్వయం ఉపాధి వైపు నడిపిస్తున్నాయని యువ నాయకుడు వ్యాపారం వైపు దృష్టి సారించిన శివ చౌదరి యువతను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నెక్కళ్లపు అన్వేష్, మోరంపూడి నరేష్, బలుసు సతీష్ , సుధీర్, రాము తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733